# గంగాజలం

—పెయ్యేటి శ్రీదేవి



"ఇదిగో పెద్దశాస్త్రి! పెద్దశాస్త్రి! ఒదినా! అన్నలేడా?" అంటూ హడావిడిగా వచ్చాడు చిన్నశాస్త్రి.

"రావయ్యా! రా! రా! ఏమిటీ ఉదయాన్నే ఇంత హడావిడిగా వచ్చావు? మీ అన్నయ్య స్నానం చేస్తున్నట్లున్నారు కూర్చో వస్తారు. ఏమిటో పెద్ద పనిబడి వచ్చినట్టున్నావే. పౌరోహిత్యాలు తక్కువే అయినా ఒక్క నిమిషం తీరికగా కూచోవు కదా. ఎప్పుడూ ఎవరో ఒకరికి సాయం చేయటమో, అనాధ పిల్లల్ని చేరదీసి వున్నంతలోనే వాళ్లకి తగిన ఉపాధి కల్పించటమో గొప్ప మనసయ్యానీది. కులమత భేదం లేకుండా ఇతరులకు సాయంచేసే మంచి మనసున్న నిన్ను ఆ దేముడు నూరేళ్ళు చల్లగా చూడాలి నాయనా."

విశ్వనాథ శాస్త్రి భార్య శారదమ్మ అంది.

"వూరుకో వదినా! నీకు నామీద వుండే అభిమానం వల్ల నువ్వు అలా అంటున్నావు గాని నువ్వు అనుకునేంత గొప్ప వాడినేం కాదులే, అన్నకి నా మీద ఎప్పుడూ కోపమేగా ఏ పని చేసినా తిడతాడు" అన్నాడు బాధగా రామశాస్త్రి.

"ఒరి. అప్రాచ్యుడా! బ్రాహ్మణ్యం మంటగలిపే నువు చేసే పన్లకి సిగ్గుపడి ఛస్తున్నాగదయ్యా. ఏమిటీ రోజా ఏదో అట్టు వేయించుకు తింటున్నావట. ఛీ! ఛీ! నా నోటితో ఎలా చెప్పేది?" అంటూ ఎప్పుడూ అలవాటుగా తిట్టే తిట్లతో గట్టిగా అరుస్తూ వచ్చాడు రామశాస్త్రి మీద పెద్దశాస్త్రి అనబడే విశ్వనాథశాస్త్రి.

ఆయన దుర్వాసముని కోపానికి ఉలిక్కిపడి కంగారుగా తాగబోతున్న కాఫీ తాగకుండానే మీద బోసుకున్నాడు. వేడి కాఫీ కదా చురుక్కుమంది. ఆయన కోపానికి అందరూ గజగజలాడిపోతారు. ఆయన ముందు ధైర్యంగా నిలబడేది, భయానికి భయం, విశ్వనాథ శాస్త్రిని రామశాస్త్రి పెద్దశాస్త్రి అని ఒక సారి, ఒక్కోసారి అన్న అని పిలుస్తుంటాడు. ఆ వూరి వారందరూ విశ్వనాథశాస్త్రిని పెద్దశాస్త్రి అని, రామశాస్త్రిని చిన్నశాస్త్రి అని పిలుస్తుంటారు. విశ్వనాథశాస్త్రి సింహంలా ఇంకా గర్జిస్తూనే వున్నాడు రామశాస్త్రి మీద విషయం ఏమిటో విశ్వనాథశాస్త్రి కొడుక్కిగాని, భార్య శారదమ్మకిగాని బోధపడలేదు. అడిగితే ఏంతంటాయో నాకెందుకు అనుకుని శారదమ్మ తన పని తాను చేసుకుపోతోంది.

"ఛీ! ఛీ!! నువు ఇలాంటి అప్రాచ్యపు పన్లుచేస్తూ పౌరోహిత్యం చేయటానికి సిగ్గులేదటయ్యా. నాకంటికి కనిపించకుండా పో అవతలికి"

"అన్నా! నామాట విను నీ దగ్గర అబద్దమాడతానా?

చెప్పేది కొంచెం విను. నీ కన్న అప్తులు నాకెవరున్నారు చెప్పు? ఇపుడు ఏంచెప్పినా నువు వినేస్థితిలో లేవుగాని, నువు ముందర బట్టలు సర్దుకో రేవురాత్రి ఏడుగంటలకి బస్సులో కాశీ, గయ, రామేశ్వరం వెడుతున్నాము టిక్కెట్లు కూడా కొనేశాను. డబ్బెక్కడిది, ఎలా కొన్నావు అంటూ అవేం అరాలు అడక్కు వదినా! అన్ని బట్టలు సర్దు" అంటూ వెలిపోయాడు రామశాస్త్రి.

ముసుగుదన్నిపడుతున్న కొడుకుని "ఏరా! గాడిదా! ఇంకా నిద్దర సరిపోలేదా లే..లే..తొందరగా స్నానం చేసిరా. నీకు మంత్రాలు చెప్తే నేను త్వరగా పెదవేమారెడ్డి గారింటికి సత్యన్నారాయణవ్రతం చేయించటానికి వెళ్ళాలి. నువ్వూ నాతో అఘోరిస్తే చేయించే విధానం అర్థమవుతుందిగా అన్నట్టు చినవేమారెడ్డి గారబ్బాయి, కోడలు అమెరికానించి వచ్చారు. సత్యన్నారాయణవ్రతం పూజా విధానం వీడియో తీస్తున్నారు. అందుకు నువ్వూ తప్పనిసరిగారా!" ఆజ్ఞాపించాడు విశ్వనాథ శాస్త్రి.

"అయితే మనం టి.వి.లో కనబడతామా నాన్నా" అడిగాడు ఆత్రుతగా కొడుకు. "ఊ..అందుకే బాగా తయారవు. ఆ ఎఱ్ఱరంగు పట్టుపంచ కట్టుకొని రా. జాగర్తగ్గా పొరబాట్లు లేకుండా చదవాల తెలిసిందా. ఆఖర్న వేదపఠనం కూడా వుంటుంది. ఇద్దరం రాగయుక్తంగా చదవాలి. ముందర అవోసారి వల్లెవేయి నేవచ్చేలోగా. వచ్చే వినాయక చవితికి కూడా వీడియో తీస్తారట మనపూజా విధానాల కేసెట్లన్నీ అమెరికా తీసికెడతారు. అక్కడ టి.విలో మన భారతీయ పూజలు ప్రసారం చేస్తారు.

"ఇదిగో! ఓసేవ్ నిన్నే! ఈరోజు అవధాన్లు గారింట్లో భోజనం కదా నాకోసం చూడకు. ఆ అన్నట్టు ఆ రామశాస్త్రి ఏదో కాశీ, గయ అంటున్నాడు బట్టలు సర్దు" అంటూ స్నానం చేసొచ్చిన కొడుక్కి మంత్రపఠనం గావించి ఇప్పుడేవస్తా సిద్ధంగా వుండు నే వచ్చేటప్పటికి, సోమయాజులు గారింటో వాళ్ళ మనవరాలి బారసాల చేయించి వస్తా అంటూ భార్య ఇచ్చిన కాఫీతాగి సంచి భుజాన తగిలించుకుని బైటపడ్డాడు విశ్వనాథ శాస్త్రి.

"అమ్మగోరూ! ఇదిగోండి పిండిమరాడించి తెచ్చినాము" అంటూ ఒక చేత్తో



పిండికేరేజి, మరో చెత్తో 'ఏదోపాట్లం పట్టుకున్న గౌరిని చూసి రమణమ్మ అడిగింది "ఏమిటే ఆ పాట్లం గౌరీ" అని.

"మన చిన్న శాత్తిరి గోరికండి. ఆమెలెట్టండి. ఆరికి ఈ మధ్య శావా జబ్బు చేసింది గదాండి. డాకటరు గారే సెప్పేవారటండీ తినమని. అప్పుడు బలం వస్తుందని అందుకే శుబ్బరంగా మడిగట్టుకువండి, గంగనీరు జల్లుకుని శుచిగా శుబ్బరంగా 'ఏసితీసికెడుతున్నానండి. మరి ఆరు బొమ్మట్లు కదండి"

"నీ మొహం నువ్వు మడిగట్టుకోవడమేమిటో అప్రదిష్ట. పైగా ఆమ్లెట్లు మడిగట్టుకువేస్తావా? ఆ చిన్న శాస్త్రి తినటమూనా. డాక్టరు తినమన్నాడని అదోవంక. ఛీ! ఛీ! ఏం పూజలు చేస్తారో 'ఏమిటో అడ్డమైన తిళ్ళూను" విసుక్కుంది రమణమ్మ

ఆ మర్నాడు సాయంత్రం చిన్ని సూట్‌కేస్, బ్యాగ్‌తో పెద్దశాస్త్రి ఇంటికి వచ్చాడు రామశాస్త్రి.

"అన్నా త్వరగా రా" అంటూ పెద్దశాస్త్రిని తొందర చేశాడు. కోపంతో వున్నప్పుడు రామశాస్త్రి అన్నా అని పిలిచే పిలుపుకి ఆయన కోపం ఎగిరి పోతుంది.

"అసలు నువు నన్ను అడక్కుండా నాకు టిక్కెట్ ఎందుకు తీశావు? అంతా నీ ఇష్టమేనా? అంతడబ్బు ఎక్కడిది? అడిగాడు విశ్వనాథశాస్త్రి. "అన్నా నువు డబ్బు గురించేం పట్టించుకోకు. కాశీ, గయ వెళ్లాలని ఎన్నాళ్ళనించో అనుకుంటున్నదేగా. ఇవాళ కుదిరింది మళ్ళీ ఈ అవకాశం రాదు."

"ఆమధ్య బాగా జబ్బు చేసింది. నీకూ తెలుసు అస్సలు లేవలేని పరిస్థితికొచ్చాను. వైద్యానికి హైదరాబాదు వెళ్ళాల్సొచ్చింది. సెలైన్ ఎక్కించారు. నాకొచ్చిన జబ్బేమిటో చెప్పకపోగా వేలకివేలు డబ్బులు మాత్రం వదిలాయి నాకు. ఆఖరికి డబ్బులు తీసుకుని వాళ్ళిచ్చిన ఖరీదు సలహా 'ఏమిటంటే "నీకు జబ్బేమీ లేదు. బలహీనంగా వున్నావు రోజూ గుడ్డు తీసుకో కోలుకుంటావు" అంటూ ఇంకా 'ఏవో టానిక్కులు, మందులు రాసిచ్చారు. వే ఎగ్ తీసుకోనంటే డాక్టర్లు తిట్టారు. "ఆమ్లెట్‌గానన్నతిను. లేకపోతే కోలుకోలేవు. అదేం మాంసాహారం కాదు ఆరోగ్యానికి చాలా మంచిది" అంటూ నచ్చచెప్పారు. ఆఖరికి ఎంతో నియమనిష్టలతో వుండే నా భార్య కూడా నా ఆరోగ్యం గురించైనా తీసుకోమని గొడవచేసింది. పాలుపోసే గౌరమ్మ శుచిగా, నుబ్బరంగా వే 'ఏసితెస్తా. కాదవకండయగోరూ అంటూ వద్దన్నా వినకుండా తెస్తుంది. ఇప్పుడు శాస్త్రి నా ఆరోగ్యమూ కుదుట పడింది. ఇంకదీ తినను. ఎలాగూ మానేద్దామనుకుంటున్నాను.

ఇంట్లో నాకొచ్చే రాబడీ అంతంతమాత్రమే. నా భార్య అప్పడాలని, ఒడియాలని ఇంకా 'ఏవో పచ్చళ్ళు చేసి కొద్దోగొప్పో సంపాదిస్తుంది. ఇది గాక సాయంత్రం పిల్లలకి ట్యూషన్లు చెబుతుంది. అడిగే మనస్తత్వం కాదు ఆమెది, వాడికూడా. అందుకే పైరాబడీ అంతంతమాత్రమే అయింది. ఇక వున్న ఒక్కకొడుకు గవర్నమెంటు మెరిట్ మీద ఎంత స్కాలర్‌షిప్ ఇచ్చినా అనలంటూ మేం కొంతన్నా పంపాలికదా.

అందుకే వున్న ఎకరం పొలం అమ్మేశాను. వాడు జాగర్తమంతుడు కాబట్టి సరిపోయింది. రాత్రుళ్ళు వాడు ఇంటరు వాళ్లకి ట్యూషన్లు చెబుతూ సంపాదిస్తున్నాడు. అందుకని నన్నేం పంపవద్దనే అంటాడు. 'ఏదో కాస్త కోలుకుంటున్న నా ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే వుంది. అన్నా! నువ్వు కూడా ఛీ పొమ్మంటే నువ్వు, వదిన తప్ప నాకెవరున్నారు చెప్పు" తన బాధంతా చెప్పకున్నాడు రామశాస్త్రి.

"నువ్వు ఇంత ఇబ్బందులు పడటమెందుకు? నన్నడిగితే నేనివ్వనా?"

"హ..!నువ్వు మాత్రం ఎన్నాళ్ళని ఇస్తావు? ఎంతని ఇస్తావు? మరీ అవసరపడితే నిన్నే అడుగుతున్నాను"

"అయ్యా! గుడ్డముక్క లేదు దరమం సెయ్యండయ్యా" ఎవరో ముష్టివాడు

గమ్మున రామశాస్త్రి ఒక సంచిలోంచి చొక్కాతీసి అతనికి ఇచ్చాడు. రెండు అరటిపళ్ళు, కాస్త పులిహోర పెట్టాడు. ఆ ముష్టివాడు పరమా

నందంతో చొక్కాతొడుక్కుని కాళ్లకి దండాలుపెట్టి "సల్లగా మారేళ్ళు వర్ధిల్లు బాబూ" అంటూ దీవించాడు.

"ఇదిగో ఇలా దానధర్మాలు చేస్తావు కాబట్టే ఇన్ని ఇబ్బందుల్లో పడుతున్నావు" "పోస్లే అన్నా మనకు కలిగిన దాంట్లోనే కొంచెం వేస్తాము. ఇందువల్ల పోయేదేముంది? 'మానవసేవే మాధవ సేవ' అన్నారు. యాత్రలకి వెళ్ళేటప్పుడు అవుడు ఇలా పాతచీరలు, చొక్కాలు మూటగట్టిస్తుంది మీ మరదలు. ఈ పుణ్యం అంతా వాదే అనుకోకు. ఒదిన కూడా ఇచ్చింది పాతబట్టలు "మీ అన్నయ్య కసలే మతిమరుపు నువ్వన్నా ఇయ్యి" అని ఇదిగో ఈ సంచి నీ దగ్గరుండని అంటూ సంచి విశ్వనాథశాస్త్రి కిచ్చాడు.

కాశీ చేరుకోగానే గంగలో స్నానాలు చేశారు. తరువాత ప్రయాగ చేరి త్రివేణి సంగమంలలో స్నానాలు చేశారు.

విశ్వనాథశాస్త్రి గంగలో స్నానం చేస్తూ పైకి ఎంత కోపంగా వున్నా మన 'సులో రామశాస్త్రిని పొగుడుకుంటూ గంగమ్మతల్లి ఒడిలో ఆనందంతో సేద తీరాడు.

అందరూ ఆ గంగమ్మతల్లి తీర్థం సీసాల్లోకి తీసుకున్నారు. విశ్వనాథశాస్త్రి, రామశాస్త్రి గంగమ్మని పెద్ద ప్లాస్టిక్ టిన్నుల్లో నింపారు.

మిగతా పుణ్యక్షేత్రాలు కూడా దర్శించి ఆ పుణ్యతీర్థాల అరని జ్ఞాపకాలతో జీవితం ధన్యమైందన్న ఆనందంతో అందరూ తిరుగు ప్రయాణమయారు.


విశ్వనాథశాస్త్రి కాశీ వెళ్లాలన్న చిరకాల వాంఛను రామశాస్త్రి బలవంత పెట్టి తీసికెళ్ళినందుకు రామశాస్త్రికి ధన్యవాదాలు చెప్పుకున్నాడు. అతని కోపాన్ని కూడా ప్రస్తుతం కాశీలో వీడి చిపెట్టినట్టున్నాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటల యింది. బస్సు ఓ అడవి ప్రదేశంలో ఆగింది. వంటాయన చేసిన పులిహోర అందరూ చెట్ల దగ్గర కూచుని తింటున్నారు. ఎక్కడనించో గట్టిగా కేకలు వినిపిస్తున్నాయి. దూరంలో కారు ఆగి వుంది. "దాహంతో పిల్ల సొమ్మసిల్లి పడిపోయింది. కొంచెం మంచినీళ్ళుంటే యివ్వండి బాబూ, మీ మేలు జన్మజన్మలకి మరువలేము" అంటూ ఇద్దరు స్త్రీలు కేకలు పెడుతున్నారు.

గమ్మున రామశాస్త్రి తను తెచ్చిన గంగాజలం టిన్ను తీసికెడుతుంటే వెనకనించి విశ్వనాథశాస్త్రి గట్టిగా అరుస్తున్నాడు.

"ఇదిగో చిన్నశాస్త్రీ! అది కాశీ గంగయ్యా అది పోస్తే ఎలాగ? మళ్ళీ కావాలంటే దొరుకుతుందా? మళ్ళీ మళ్ళీ తెచ్చుకోగలమా?..." అంటూ ఇంకా ఏదో అంటున్నాడు పెదశాస్త్రి.

గంగాజలం తీసికెళ్ళి గమ్మున ఆపాప మొహం మీద జల్లి నోట్లో పోశాడు. పాప నెమ్మదిగా కోలుకుంది. "ఇవాళ పిల్లప్రాణాలు కాపాడారు బాబు, మేం షిర్డీవెళ్ళి వస్తున్నాం. తెచ్చుకున్న మంచి నీళ్ళు అయిపోయాయి. ఎంత సేపటి నించో చూస్తున్నాం ఎవరన్నా వస్తారే మోని, ఈ దరిదాపుల్లో నీళ్ళు దొరికే మార్గం కనిపించలేదు. సమయానికి ఆ బాబాయే మీ రూపంలో వచ్చి పిల్లప్రాణాలు కాపాడారు బాబు" అని వాళ్ళు చేతులెత్తి నమస్కరించారు.




బస్సులో యాత్రికులు తొందరపెట్టారు బస్సు బయల్దేరుతోంది రమ్మని రామశాస్త్రి "అమ్మా ఇది మీ దగ్గరుంచండి గంగాజలం" మంచినీళ్ళ టిన్ను వాళ్ళకిచ్చి అంటూ బస్సులో కూచున్నాడు.

"బుద్ధుందా నీకు? ఎంతో కష్టపడి తెచ్చుకున్న పవిత్ర గంగాజలం వాళ్ళకిచ్చేస్తావా? ఏమనుకుంటున్నావు నువ్వు? నువ్వో గొప్పవాడివి, త్యాగధన్యుడివి అనుకుంటున్నావా? మళ్ళీ మళ్ళీ అంత దూరం వెళ్ళి తెచ్చుకోగలమా? ఎంతో అపురూపంగా తెచ్చుకుని దాచుకునే గంగాజలాన్ని ఇచ్చేస్తావా?" అంటూ రామశాస్త్రిమీద విరుచుకుపడ్డాడు విశ్వనాథశాస్త్రి.

"అన్నా! ఒకపక్క ఆపిల్ల దాహంతో వడదెబ్బ తగిలిపడిపోతే మంచినీళ్ళివ్వడం తప్పంటావా? అది కాశీ గంగని, పవిత్ర గంగాజలలం ఎక్కడా దొరకదు అంటావు. మనిషి ప్రాణాపాయస్థితిలో ఆదుకోలేనిది పవిత్రం అవుతుందా? ప్రస్తుతం మన దగ్గర వున్నది గంగ నీళ్ళు. వాళ్ళకి నీళ్ళు అవసరం. ఆ సమయంలో ఆ దరిదాపుల్లో ఎక్కడా నీళ్ళు లేవు. వాళ్ళు డబ్బులేనివాళ్ళు కాదు. అంత డబ్బుండి ఒక్కోసారి చిన్న అవసరాలు కూడా తీరని పరిస్థితి ఏర్పడుతుంది. ఆ చిన్నవసరాలే ప్రాణాపాయస్థితికి దారితీయవచ్చు. అటువంటి సమయంలో 'మనిషి' అన్నవాడికి సాటిమనిషిని ఆదుకోవల్సిన బాధ్యత వుండక్కర్లేదా? ఇక్కడ నువ్వు అనుకునే ఆ పవిత్ర గంగాజలమే ఆ పిల్ల ప్రాణాలు కాపాడింది. నువ్వైతే ఏం చేస్తావు? ఆ గంగాజలాన్ని ఇంటికి తీసికెళ్ళి నీ ఇంట్లో దేముడి దగ్గర అతిభద్రంగా ఏళ్ళ తరబడి, యుగాల తరమడి దాస్తూ ఇంట్లో ఏ చిన్న అనాచారం జరిగిందని తెలిసినా ఈ జలాన్ని నీ నెత్తిమీద, ఇల్లంతా, మంత్రాలు చదువుతు జల్లుతావు. అదేగా నువ్వు చేసేపని? పోనీ అనాచారం జరిగిందే అనుకో ఏ దేముడన్నావచ్చి నిన్ను కొడతావా? దెయ్యాలూ, భూతాలు వచ్చి నిన్నేం పీక్కుతింటాయా లేదే పీక్కుతినేది మనుషులు దెయ్యాలు, భూతాలు రూపంలో వుండే మనుషులు, లేక దేముడు నీకు అపకారం చేస్తాడని భయమా? ఆ మాధవుడే మానవసేవ చేయమన్నప్పుడు నీకెందుకంత భయం?

పవిత్రత అనేది మనసుకి వుండాలి. మనసు పవిత్రంగా లేకపోతే గంగాజలం కూడా పవిత్రంగా వుండదు. ఇది కాశీ గంగ అని దానిమీదేమన్నా రాసుందా? నువు గుర్తుపట్టగలవా? చెబితేనేగా తెలిసేది. సీసాలో మామూలు నీళ్ళిచ్చి కాశీ గంగని చెప్పినా నువ్వు నమ్మేసి భద్రంగా దాచుకుంటావు. కాశీ గంగ తాగినా, కుళాయినీళ్ళు తాగినా దాని ప్రభావం వెంటనేగాని, తరవాత గాని తెలుస్తుందా? అందువల్ల మనిషికి దాహంగా వుంటే ఏ నీళ్ళయినా పొయ్యాలి కదా.

'భగవంతుని అద్భుతసృష్టిలో మంచి నీళ్ళు ఒకటి'

తిండిలేకపోయినా బతకచ్చు నీళ్లు లేకపోతే బతకలేం. గుమ్మంలోకొచ్చిన మనిషికి రాగానే ముందర మంచినీళ్ళిస్తారు. ఇది సంస్కారవంతుల లక్షణం అని చెప్పాడు రామశాస్త్రి.

"ఆచార వ్యవహారాలు మనిషిని సత్రమమైన మార్గంలో పెట్టడానికేగాని మూర్ఖంగా పట్టుకువెళ్ళడమని కాదు. మతంకన్న గొప్పది మానవత్వం. అందుకని మనిషికి వుండవలసింది మతం కాదు మానవత్వం కావాలి" అంటూ చెప్పాడు రామశాస్త్రి.

బస్సులో వున్న వాళ్ళంతా రామశాస్త్రి చెప్పిన మాటలు మంత్రముగ్ధుల్లా విన్నారు. అందరూ అతను చేసిన పనిని సమర్థించారు. తరవాత ప్రయాణం చేస్తున్నంత సేపూ విశ్వనాథ శాస్త్రి మౌనంగా వున్నాడు! అతడిలో తర్కం ప్రారంభమయింది.

ఇంటికి చేరిన మర్నాడు రామశాస్త్రికి పెదవేమారెడ్డి కబురుచేశాడు. ఎందుకో అని కంగారుగా వెళ్లాడు. దారి మధ్యలో గంగనీళ్ళు పోసి కాపాడింది ఎవరికోకాదు పెదవేమారెడ్డి మనవరాలు. అమెరికా నించివచ్చిన కూతురు, కొడుకు, ఆయన తల్లి, మనవరాలు, మూడేళ్ళ కొడుకు అందరూ షిర్డీవెళ్ళి వస్తున్నారు. దారిలో ఎక్కడా నీళ్ళులేక వడదెబ్బ తగిలి పడిపోయిన మనవరాలికి గంగాజలం యిచ్చి రామశాస్త్రి చేసిన సహాయం గురించి బస్సులో ప్రయాణం చేసిన ఆవూరి వాళ్ళు, తల్లి పెదవేమారెడ్డికి వివరంగా చెప్పారు.

అందుకని రామశాస్త్రిని పిలిచి "ఇక మా పౌరోహిత్యాలు, మా తమ్ముడి గారింట్లోని అన్నీ మీరే చెయ్యాలి" అని చెప్పాడు పెదవేమారెడ్డి.

"అయ్యా! మరి పెద్దశాస్త్రి గారు చేస్తున్నారు కదా వారికి అన్యాయం చేయడం నా వల్లకాదు. మీ మాట కాదంటున్నందుకు మన్నించండి! అంటూ వెనక్కి తిరిగాడు రామశాస్త్రి!

00